క్లుప్తంగా

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం సోమశిల సచివాలయ పరిధిలో 30, 31 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సీతారామపురంలో..

సీతారామపురం: సీతారామపురం బిట్-2 సచివాలయ పరిధిలోని నారాయణప్పపేట, పండ్రంగి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు 'ఆడుదాం ఆంధ్ర'పై చర్చ

చేజర్ల(సోమశిల): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై చర్చ ఉంటుందని ఎంపీడీఓ మధుసూదన్‌రావు, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'ఆడుదాం ఆంధ్ర'లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ, వేదిక ఎంపిక తదితర అంశాలను చర్చించేందుకు మండలంలోని అన్ని ఉన్నత, రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలల పీడీలు, పీఈటీలు ఈ నెల 31వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చోరీ

చేజర్ల (సోమశిల): మండలలంలోని ఉప్పలపాడులో కొలువైన ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్సై బోజ్యానాయక్ కథనం మేరకు.. దుండగులు ఆలయం తలుపులు పగులగొట్టి హుండీలోని సుమారు రూ.40 వేల నగదు, అమ్మవారి మెడలోని 4 గ్రా.బంగారు మంగళసూత్రం చోరీ చేసినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి శనివారం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి ప్రాథమిక ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా యోమే ఆషురా



పాల్గొన్న మతపెద్దలు

ఉదయగిరి: మొహర్రం పండగలో భాగంగా ఉదయగిరిలోని అబ్దుల్‌ఖాదర్ ఖాన్‌సాహెబ్ దర్గాలో శనివారం యోమే ఆషురా కార్యక్రమం ఘనంగా జరిగింది. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని వీరమరణం పొందిన మతపెద్ద హజరత్ ఇమామ్ హుస్సేన్ ఆకాంక్షించే వారని తెలిపారు. మత పెద్దలు హనీఫ్ ఖాలిది, సయ్యద్ హంజాహుస్సేని, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ పాల్గొన్నారు.

యాత్రికుల సందడి



యాత్రికులకు సూచనలు ఇస్తున్న పోలీసులు

సంగం: రొట్టెల పండగ నేపథ్యంలో సంగం బ్యారేజీ వద్ద యాత్రికుల తాకిడి మొదలైంది. పక్క రాష్ట్రాల నుంచి బస్సుల్లో యాత్రికులు బ్యారేజీ వద్దకు చేరుకుంటున్నారు. దీంతో బ్యారేజీ వద్ద నుంచి వాతావరణం నెలకొంది. బ్యారేజీ వద్ద లోతైన ప్రాంతాలను గుర్తిస్తూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బ్యారేజ్ వద్ద, కాలువలలో యాత్రికులు దిగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజల చెంతకు పాలన



సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి

కలిగిరి: గ్రామాల్లో గ్రామసచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజల చెంతకు పాలనను చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి తెలిపారు. కలిగిరిలోని కలిగిరి- 1, కలిగిరి -2 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామసభను శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3522 సర్వీసెస్‌కు సంబంధించి సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, ఏపీ స్టేట్ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఝాన్సీ, మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ ఆర్వీ కళాధర్‌రావు, తహసీల్దార్ శ్రీరామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజు, ఈఓపీఆర్డీ మధు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ ఆనందం

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి హారతులు ఇస్తున్న మహిళలు

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా అందిస్తుండడంతో ప్రతి గడపలోనూ ఆనందం కనిపిస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ఏసీఎస్ఆర్‌కాలనీ సచివాలయం పరిధిలో 19, 20 వార్డుల్లో శనివారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు నవరత్నాలు పథకాల ద్వారా సొంత ఇళ్లు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, తదితర సంక్షేమ పథకాలు ద్వారా నిధుల వెల్లువగా అందిస్తున్నారన్నారు. దీంతో గతంతో పోలిస్తే ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగైనట్లు లబ్ధిదారులే చెబుతున్నారన్నారు. వలంటీర్ల పనితీరు, సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక్కో కుటుంబంలో నవరత్నాలు పథకాల్లో కనీసం ఒక్క పథకమైనా కచ్చితంగా అందుతుండడంతో ప్రభుత్వం తమను గుర్తిస్తోందన్న భావన ప్రజల్లో కనిపిస్తుందన్నారు. 20 వార్డు ఎరుకలసానినగర్ వాసులు రెండు దశాబ్దాలకుపైగా తమకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయలేదని కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే స్థానిక ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎదుట హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చిన్న పిల్లలతో కలిసి మహిళలు ఎమ్మెల్యేపై పూలు చల్లుతూ తమ కాలనీలోకి ఘన స్వాగతం పలికారు. స్థానిక పెద్దలు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానం చేశారు. తొలుత సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆయన ఆ పరిధిలో మంజూరైన సంక్షేమ పథకాలు, సాంకేతిక సమస్యలతో నిలిచిన పథకాలపై వివరాలు అడిగి తెలుసుకుని సంబంధిత వ్యక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, సొసైటీ అధ్యక్షుడు ఎస్ ప్రతాప్‌రెడ్డి, నందవరం ప్రతాప్, ప్రసాద్, ఎక్స్ అఫిషియో సభ్యురాలు నందవరం కృపావరమ్మ, కొండా వెంకటేశ్వర్లు, వెంకటరమణ, కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, పి పెంచలయ్య, నాయకులు షేక్ రిజ్వాన్, రహీం, సయ్యద్ జమీర్, కలాం, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ఉదయగిరి: కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేసి పంచాయతీ ఖాతాలో జమ చేయాలని పలువురు సర్పంచ్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉదయగిరి మండలం గన్నేపల్లిలో శనివారం సర్పంచ్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి దృష్టికి ఈ అంశం తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కేంద్రం విడుదల చేసే నిధులు వెంటనే పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నెల్లూరు వెంకటస్వామి, పలువురు బీజేపీ నేతలు ఎం.మాల్యాద్రినాయుడు, పి.వెంకటేశ్వర్లు, చుండి హరిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

వింజమూరు(ఉదయగిరి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు డిమాండ్ చేశారు. వింజమూరులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన మాట తప్పిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మాదిగలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్, వాసు దేవరావు, కె.రమేష్, బకీరు జాషువా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో చేజర్ల విద్యార్థి ప్రతిభ



ప్రశాంత్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

చేజర్ల: జాతీయ స్థాయి ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మండలంలోని కొల్లపనాయుడుపల్లికి చెందిన రేణంకి రామకృష్ణ కుమారుడు రేణంకి ప్రశాంత్ 1931వ ర్యాంక్ సాధించాడు. జార్ఖండ్ రాష్ట్రంలోని దన్బాగ్ నగరంలోని ఐఐటీ కళాశాలలో సీటు సాధించాడు. ఆ విద్యార్థిని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి కొలప్లనాయుడుపల్లిలోని అతని నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంగవరపు దామోదర్‌రెడ్డి, రేణంకి ప్రసాద్, శ్రీకాంత్, యు పుల్లయ్య యాదవ్, వంగవరపు ఆనంద్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పెంచలరెడ్డి, సు . దీర్‌రెడ్డి, కల్యాణ్ పాల్గొన్నారు.

అటవీ అనుమతులు మంజూరు చేయండి

ఉదయగిరి: ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు మార్గంలో అటవీ ప్రాంతంలో ఉన్న మూడు కి.మీ. రహదారి నిర్మాణానికి సంబంధించి అటవీ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బిజ్జంపల్లిలో శనివారం స్థానికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే కొండకింద పల్లెల కష్టాలు తీరుతాయన్నారు. ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్థానిక అధికారులు అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపినప్పటికీ ఇంకా అనుమతి మంజూరు కాలేదన్నారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి వెంటనే జోక్యం చేసుకుని అటవీ అనుమతులు మంజూరుచేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు.

సీపీఐ శిక్షణా తరగతులను జయప్రదం చేద్దాం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఆత్మకూరులో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు, జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు ఆధ్వర్యంలో శనివారం శిక్షణా తరగతులపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలను, నూతనంగా చేరే కార్యకర్తలకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో మూడు రోజుల పాటు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, మర్రిపాడు కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

సొంత నిధులతో ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధిత రైతులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టనంలోని 9వ వార్డుకు చెందిన నలుగురు రైతుల గడ్డివాములు దగ్ధమైన నేపథ్యంలో బాధిత రైతులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వెంగమ్మ అనే వృద్ధురాలి అనారోగ్య, ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమె వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

గంధమహోత్సవానికి విరాళం

ఆత్మకూరులోని ఖాజా నాయబ్‌రసూల్ గంధమహోత్సవం సోమవారం జరగనున్న క్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విరాళం చెక్కును దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఎన్ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, కె చిన్నపరెడ్డి, షేక్ రిజ్వాన్, రహీం, కలాం ఉన్నారు.

రేపు తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష

నెల్లూరు (దర్గామిట్ట): ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఈ నెల 31న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10న ఆత్మకూరులో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు పర్యటించనున్నారని, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు సంబంధించి చుక్కల భూముల పంపిణీ, సాదాబైనామా, ఇతర రెవెన్యూ సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించి మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఉదయం 10 గంటలకు జరిగే సమీక్ష సమావేశానికి తహసీల్దార్లు, ఎంపీడీఓలు తప్పక హాజరుకావాలని కోరారు.

ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం ఎస్సీ కాలనీలో జ్వరాలు అధికంగా ఉండడంతో శనివారం మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ తన వైద్య సిబ్బందితో కలిసి జ్వర పీడితులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పులు వల్ల సీజనల్ వ్యాధులు వస్తున్నాయని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి మల్లెం కొండయ్య, హెల్త్ సూపర్ వైజర్ సైదా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగల మహాసభను జయప్రదం చేద్దాం



ఎంఆర్‌పీఎస్ సన్నాహక సభలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు నాగరాజు

ఆత్మకూరు: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అన్నారు. త్వరలో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేసేందుకు సన్నాహక సమావేశం పట్టణంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లు పూర్తయినా వర్గీకరణ అంశాన్ని విస్మరించిందని ఆరోపించారు. జిల్లా కన్వీనర్ పందిటి అంబేడ్కర్, ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు, కో-కన్వీనర్లు కె రమేష్, అడుసుమిల్లి వేణు, బొద్దుకూరి మహేష్, గంగపట్ల లక్ష్మమ్మ, జి ఆదినారాయణ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని వృద్ధుడి మృతి

• ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: బైక్‌లు ఢీకొనడంతో వాహనాన్ని నడుపుతున్న వృద్ధుడు ఎగిరి వెనుకనే వస్తున్న లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆత్మకూరు సమీపంలోని నారంపేట వద్ద శనివారం సాయంత్రం జరిగింది. ఎస్సై ముత్యాలరావు వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన యర్రగుంట పిచ్చయ్య (74) తన మనవడు బెంజిమెన్‌తో కలిసి నెల్లూరులోని తన కుమారుడి వద్దకెళ్లారు. తిరిగి బైక్‌పై బయల్దేరారు. ఆత్మకూరు హిల్ రోడ్డు ప్రాంతానికి చెందిన ఏటూరి నరసింహ బైక్‌పై కరటంపాడు నుంచి ఆత్మకూరు వస్తున్నారు. నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై నారంపేట అడ్డరోడ్డు వద్ద బైక్‌లు ఢీకొన్నాయి. పిచ్చయ్య బైక్‌పై నుంచి ఎగిరి వెనుకనే కృష్ణపట్నం నుంచి బళ్లారి వెళ్తున్న లారీ వెనుక చక్రాల కిందపడ్డారు. హెల్మెట్ ఉన్నా తలపగిలి నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందారు. వెనుకనే ఉన్న బెంజిమెన్ స్వల్పంగా, మరో బైక్‌పై ఉన్న నరసింహ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నరసింహను మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జగనన్న సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో జనరంజక పాలన

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జనరంజక పాలన నడుస్తోందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తూర్పు గోగులపల్లిలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని తెలియజేశారు. సంబంధిత బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్న పథకాలతో నవశకానికి నాంది పలికిన ముఖ్యమంత్రికి సంక్షేమం, అభివృద్ధి రెండూ కళ్లలాంటివన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే చేరుస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమవుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు చెప్పని ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజాప్రతినిధులు గ్రామస్థాయిలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, బీద రమేష్, ఉస్మాన్, తోట శీనయ్య, పవన్ కుమార్‌రెడ్డి, రామలింగం చిరంజీవిరెడ్డి, సురేష్, మస్తాన్, నిరంజన్, గోపాల్, రఘురాం, ఆదామ్, చెంచురామిరెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా మొహర్రం



అల్లూరు మౌలాలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మర్రిపాడు మండలం చుంచులూరులో పీర్ల ఊరేగింపులో భక్తుల కోలాహలం

• వేడుకల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్

అల్లూరు: మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో స్థానిక మసీద్ సెంటర్‌లో కోలాహలంగా.. వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక మౌలాలి దర్గాలో, పీర్ల చావడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగాలకు ప్రతీకగా మొహర్రం నిర్వహిస్తారని, కుల, మతాలకు అతీతంగా నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలోనే అల్లూరు మండలంలో జరిగే గుండ మహోత్సవ కార్యక్రమం, మౌలాలి సవారి, మోహుర్ పీర్ ఎంతో ప్రత్యేకంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కమిటీ సభ్యులు షేక్ ఉస్మాన్ షరీఫ్, షేక్ జావిద్, షేక్ మన్సూర్, షేక్ అయూబ్, షేక్ ఫాజిల్, షేక్ షబ్బీర్, షేక్ జంషీర్, షేక్ హబీబ్, షన్న, మసూద్ సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

కుల, మతాలకు ప్రతీకగా మొహర్రం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం ముగింపు వేడుకలు శనివారం కోలాహలంగా జరిగాయి. మండలంలోని చుంచులూరులో హిందూ, ముస్లింలు ఐక్యమత్యంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పీర్లను విశేష పుష్పాలతో అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించి అగ్నిగుండ ప్రవేశం చేసి పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భారీగా అన్నదానాలు నిర్వహించారు. మర్రిపాడు, నందవరం, పడమటినాయుడుపల్లి, కృష్ణాపురం, సింగనపల్లి, పెగళ్లపాడు, కదిరినేనిపల్లి, చిన్నమాచనూరు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

చేజర్ల: మండలంలోని పలు ప్రాంతాల్లో మొహర్రం వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని చేజర్ల, పుట్టుపల్లి, ఉలవపల్లి, పెరుమాళ్లపాడు, మడపల్లి గ్రామాల్లో నిర్వహించారు. చేజర్లలో పీర్ల చావిడి వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మొహర్రం ముగింపు వేడుకలు నిర్వహించారు. అనంతసాగరం, ఆమని చిరువెళ్ల, ఉప్పలపాడు, సోమశిల, ముస్తాపురం, పాతదేవరాయపల్లి గ్రామాల్లో నిర్వహించారు. షహదత్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు పీర్లను బావులకు తరలించారు.

ఉత్సాహంగా మొహర్రం

సంగం: మండలంలోని తలుపూరుపాడులోని పీర్లచావిడి వద్ద ముస్లింలు మొహర్రం ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తప్పెట్లు, తాళాలతో పీర్లు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు. గుండం చుట్టూ ఊరేగింపు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం తొక్కారు.

త్యాగానికి ప్రతీకగా మొహర్రం

ఉదయగిరి: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండగను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని బిజ్జంపల్లి, పుల్లాయపల్లి, గండిపాళెం, ఉదయగిరిలోని గుంతబజారు, నాగుల బావివీధి, అబ్దుల్‌ఖాదర్ ఖాన్‌సావలి దర్గా తదితర ప్రాంతాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. హిందూ ముస్లింలు ఈ వేడుకల్లో పాల్గొని మతసామరస్యతకు ప్రతీకగా నిలిచారు.

ఘనంగా మొహర్రం

జలదంకి: జలదంకితో పాటు పలు గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని చావిడిల్లో కొలువైన పీర్ల దేవుళ్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



తలూరుపాడులో అగ్నిగుండంలో నిప్పులు తొక్కుతున్న భక్తులు



అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో పీర్ల ఊరేగింపు

దీర్ఘకాలిక కష్టాలు తీర్చిన జగనన్న సురక్ష



జగనన్న సురక్ష క్యాంపులో లబ్ధిదారులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిరణ్

కావలి: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా.. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందని పరిస్థితుల్లో పథకాల లబ్ధిని పొందలేనంటువారి రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. నూరు శాతం సంక్షేమ ఫలాలు అందించాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత వలంటీర్లు తమ పరిధిలోని గృహస్తులకు అవసరమైన సర్టిఫికెట్లు, పెండింగ్ పథకాలపై ఇంటింటికి తిరిగి నివేదిక సిద్ధం చేశారు. ఆ మేరకు ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ఉన్న అడ్డంకులను తొలగించి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందించారు. వీటి ఆధారంగా అర్హత ఉండీ సంక్షేమ పథకం పొందలేకపోయిన వారికి తిరిగి సంక్షేమ పథకాలు చేకూరనున్నాయి. అందులో భాగంగా కావలి పట్టణంలో నెల రోజులు పాటు నిర్విరామంగా జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ముగిసింది. పట్టణంలోని 40 వార్డుల పరిధిలో 26 జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. మునిపల్ కమిషనర్ ఈగ కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సురక్ష కార్యక్రమం మొత్తం 33,817 నివాసాలను సందర్శించిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలను కలుసుకున్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ సేవల సర్వేలో 29,123 మంది పాల్గొన్నారు. 22,612 మంది దరఖాస్తు చేసుకోగా మున్సిపాలిటీకి అందాయి. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా 22,292 సేవలు నేరుగా ప్రజలు అందుకున్నారు. 252 విజ్ఞప్తులు తిరస్కరించగా, 69 విజ్ఞప్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. జగనన్న సురక్ష క్యాంపుల్లో కొన్ని చోట్ల ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వీకే శీనా నాయక్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కావలి పట్టణ సచివాలయ కన్వీనర్లు పాసుగోటి అనురాధ, కనుపర్తి రాజశేఖర్ క్యాంపులలో పాల్గొన్నారు. మండలంలో తహసీల్దార్ కె.మాధవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలో జగనన్న సురక్ష 16 క్యాంపులు జరిగాయి. 19,272 నివాసాలను గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు సర్వే చేయగా 16,935 మంది పాల్గొన్నారు.